APTEL/2009/29308

స్నేహిత
# ఎక్స్‌ప్రెస్
నిజం దాగదు.. వార్త ఆగదు

తెలుగు దినపత్రిక


04-07-2026
శనివారం
హైదరాబాద్
సంపుటి: 17 । సంచిక: 250
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.expresstelugudaily.com





## తెలంగాణ ఎగుమతుల సామర్థ్యం పెంచండి




# రూ.8.21 లక్షల కోట్లు అప్పులు చేసింది మీరు కాదా?

## బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులు రాష్ట్రానికి భారంగా మారాయి

### చేసిన అప్పులను తక్కువగా చూపించేందుకు కేటీఆర్, హరీశ్ ప్రయత్నిస్తున్నారు

- సింగరేణి నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లే అవకాశం లేదు
- సింగరేణిపై బీఆర్ఎస్ నేతలు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారు
- సింగరేణికి కొత్త బ్లాక్‌లు రాకుండా అడ్డుకున్నది కేటీఆర్, హరీశ్‌రావులే
- పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పుల పై కేసీఆర్ మాట్లాడాలి
- బీఆర్ఎస్‌పై డిప్యూటీ సీఎం భట్టి తీవ్ర విమర్శలు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాజీ మంత్రి హరీశ్ రావు అసత్య ప్రచారం చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము చేసిన అప్పులను, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఇద్దరూ ప్రజా ప్రభుత్వంపై ఎదురుదాడికి దిగుతున్నారని మండిపడ్డారు. సింగరేణి సంస్థను బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు సంక్షోభంలోకి నెట్టిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు సింగరేణి ప్రాంతాల్లో తిరుగుతూ మళ్లీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. సింగరేణి నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లే అవకాశం లేదని చెప్తూనే గతంలో జరిగిన బొగ్గు మాయం ఆరోపణలపై తాము సీరియస్‌గా ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు.

**బీఆర్ఎస్ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు..**

వివిధ మార్గాల ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేశారని భట్టి విక్రమార్క అన్నారు. బుకాయింపులు, అసత్యలతో ఎన్నాళ్లు మోసం చేస్తారని మండిపడ్డారు. ఈ అప్పులపై నిత్యం మాట్లాడితే రాష్ట్రం పరువు పోతుందని వెనక్కి తగ్గామని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం వచ్చాక, వడ్డీతో కలిపి రూ.2.08 లక్షల కోట్లను చెల్లించామన్నారు. 10 వడ్డీకి కూడా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అప్పులు తెచ్చారన్నారు. వడ్డీల భారాన్ని తగ్గించేందుకు తాము అనేక చర్యలు చేపట్టినట్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కట్టాల్సిన వడ్డీని రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గించామన్నారు. రోడ్డుపై నిలబడి అడ్డగోలుగా రోజూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సింగరేణిపై బీఆర్ఎస్ నేతలు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారన్నారు. సింగరేణి కోల్ బ్లాక్‌లను పెంచేందుకు చిన్న ప్రయత్నమైనా చేశారా అని భట్టి ప్రశ్నించారు.

**అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు..**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులను కేటీఆర్, హరీశ్‌రావులు తక్కువ చేసి చూపేందుకు ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. హరీశ్ రావు మంత్రిగా చేశాననే విషయం మర్చిపోయి అనేక విషయాలపై..

మిగతా 2లో...

## తెలంగాణ పోలీసు శాఖలో 5వేల ఉద్యోగాల భర్తీ

- ప్రభుత్వం ఆమోదం తెలుపుతూ నిర్ణయం
- ఆర్థిక శాఖ అనుమతులు మంజూరు చేయడంతో భర్తీ ప్రక్రియకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్




## భూతగాదాల్లో.. జోక్యం వద్దు

- ప్రజలకు అందుబాటులో ఉండాలి
- విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు..
- విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ అండ్ సేఫ్టీ కమిటీలను బలోపేతం చేయాలి
- సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు ప్రత్యేక సాంకేతిక శిక్షణ ఇస్తాం: డీజీపీ సీవీ ఆనంద్






## ఉస్మానియా వైద్యులు దేశానికే గర్వకారణం

- 'అవయవదానం.. మహాదానం' అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ సమాజంలోకి తీసుకెళ్లాలి
- ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ సంస్థలకు ధీటుగా తీర్చిదిద్దుతున్నాం
- ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనే ప్రజలకు అన్నిరకాల మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే లక్ష్యం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

2

దేశంలోనే తొలిసారిగా అరుదైన అవయవాల మార్పిడితో రికార్డుకెక్కారు

36 గంటల పాటు శ్రమించి విజయవంతం చేయడం అసాధారణ విజయం

## మోడీ 3 దేశాల పర్యటన ఖరారు



- ఈ నెల 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పర్యటించనున్న ప్రధాని
- 40ఏళ్లలో తొలిసారి న్యూజిలాండ్‌లో పర్యటన
- వెల్లడించిన విదేశాంగ మంత్రిత్వ శాఖ

2




## 'వీబీ జీరాంజీ'ని అడ్డుకోవాలనుకోవడం దుర్మార్గం

- ఈ పథకంతో పేదలకు ఎంతో మేలు జరగటంతోపాటు శాశ్వత ఆస్తుల సృష్టి జరుగుతుంది
- కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆడుతున్న నాటకాలు 'బిగ్‌బాస్' షోను తలపిస్తున్నాయి
- రాష్ట్రంలో చాపకింద నీరులా బీజేపీ బలపడుతోంది
- ఓర్వలేకే ఈ రెండు పార్టీలు లోపాయికారీ ఒప్పందం చేసుకుని డ్రామాలాడుతున్నాయి
- కేంద్ర మంత్రి బండి సంజయ్


విలేకరులు కావలెను
స్నేహిత ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
expresstelugudaily.com
Contacts
తెలంగాణ
95500 21491

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
ఎక్స్‌ప్రెస్ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు మండల రిపోర్టర్లు, యాడ్స్ ఏజెంట్స్ వెంటనే కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు..

## రూ.8.21 లక్షల కోట్లు అప్పులు చేసింది మీరు కాదా?

(మొదటి తరువాయి)

అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియా ద్వారా అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారన్నారు. వారు చెప్పే అబద్ధాలు ప్రజల్లోకి వెళ్లకూడదన్నారు. నిశ్శబ్ధంగా ఉంటే వ్యవస్థలకు నష్టం చేసిన వాళ్లమవుతామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అబద్ధాల పునాదులపై పదేళ్లపాటు పాలన చేశారన్నారు. ఆ పార్టీ నేతలు కావాలని పదేపదే అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క మండిపడ్డారు. ఆ పార్టీ వారు అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని భట్టి విక్రమార్క తెలిపారు. పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై కేసీఆర్ మాట్లాడాలని ఆయన సవాల్ విసిరారు. అప్పులు చేసి రాష్ట్రంపై పెనుభారం వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు.

### సింగరేణి బొగ్గు ఆరోపణలపై విచారణకు ఆదేశం..

సింగరేణికి నష్టం కలిగించాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు అనేక రకాలుగా ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. కోల్‌బ్లాక్‌లు తెచ్చుకునేందుకు కేంద్రంతో మాట్లాడుతున్నామన్న ఆయన సింగరేణి నుంచి కేజీ బొగ్గు కూడా బయటకు వెళ్లేందుకు అవకాశం లేదన్నారు. సింగరేణిపై కావాలనే బీఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సింగరేణికి కొత్త బ్లాక్‌లు రాకుండా అడ్డుకున్నది కేటీఆర్, హరీశ్‌రావులేనని భట్టి విక్రమార్క ఆరోపించారు. సింగరేణిలో బొగ్గుమాయమైందని కేటీఆర్, హరీశ్‌రావులు చేసిన ఆరోపణలపై స్పందించిన భట్టి విక్రమార్క వాటిపై విచారించాలని ఆ సంస్థ విజిలెన్స్ డైరెక్టర్‌ను ఆదేశించారు. సింగరేణికి నష్టం కలిగిస్తే నష్టపోయేది రాష్ట్రప్రజలేనని ఆయన తెలిపారు.

## 'వీబీ జీరాంజీ'ని అడ్డుకోవాలనుకోవడం దుర్మార్గం

**కరీంనగర్, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** 'వీబీ జీరాంజీ' పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు ఎంతో మేలు జరగటంతోపాటు శాశ్వత ఆస్తుల సృష్టి జరుగుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఈ పథకం అమలు చేస్తే కేంద్రానికి మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే సుప్రీంకోర్టును ఆశ్రయించి అడ్డుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం చూడటం దుర్మార్గమని మండిపడ్డారు. కరీంనగర్‌లో పలు అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు.

దేశవ్యాప్తంగా ఉపాధిహామీ పథకానికి రూ.8 లక్షల కోట్లకు పైగా.. రాష్ట్రంలో రూ.39 వేల కోట్లు ఖర్చు చేసినా ఆశించిన స్థాయిలో ఆస్తుల సృష్టి జరగలేదని, దాన్ని మార్చేందుకు కేంద్రం కొత్తగా 'వీబీ జీరాంజీ' పథకాన్ని తెచ్చిందన్నారు. దీని ద్వారా కూలీలకు 125 రోజుల పని లభిస్తుందని, ఒకవేళ పని కల్పించకపోతే 15 రోజుల్లోనే వేతనం అందేలా నిబంధనలు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నభోజన సౌకర్యం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ఒక వైపు అల్పాహారం ఇస్తూనే.. మరోవైపు రాష్ట్రంలో ఏకంగా 10వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ఈ నిర్ణయంపై పునరాలోచించాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆడుతున్న నాటకాలు 'బిగ్‌బాస్' షోను తలపిస్తున్నాయని సంజయ్ ఎద్దేవా చేశారు. కేవలం మీడియా కవరేజీ కోసమే రెండు పార్టీలు తంటాలు పడుతున్నాయన్నారు. రాష్ట్రంలో చాపకింద నీరులా బీజేపీ బలపడుతోందని, తమ ఎదుగుదలను చూసి ఓర్వలేకే ఈ రెండు పార్టీలు లోపాయికారీ ఒప్పందం చేసుకుని డ్రామాలాడుతున్నాయని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజలు ఈ రెండు అవినీతి పార్టీలను త్వరలోనే ఎలిమినేట్ చేసి డబుల్ ఇంజిన్ సర్కార్‌ను తీసుకురావాలని చూస్తున్నారన్నారు.

## తెలంగాణ పోలీసు శాఖలో 5వేల ఉద్యోగాల భర్తీ

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** నిరుద్యోగ యువతకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పోలీసు శాఖలో 5,000 ఉద్యోగాల భర్తీకి ఆమోదం తెలిపింది. ఆర్థిక శాఖ అనుమతులు మంజూరు చేయడంతో భర్తీ ప్రక్రియకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో త్వరలోనే పోస్టుల భర్తీకి సంబంధించిన అర్హతలు, వయోపరిమితులు, ఎంపిక విధానం, పరీక్షల షెడ్యూల్‌తో కూడిన పూర్తిస్థాయి నోటిఫికేషన్‌ను ప్రకటించే అవకాశం ఉంది. 10 విభాగాల్లో కలిపి మొత్తంగా 5,000 పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయనుంది. అత్యధికంగా పోలీసు కానిస్టేబుల్ (సివిల్) విభాగంలో 3,697 పోస్టులు, ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ విభాగంలో 1,052 పోస్టులను భర్తీ చేయనున్నారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ (సివిల్)148, సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఆర్మ్‌డ్ రిజర్వ్)14, రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (టీజీఎస్పీ) 12, సబ్ ఇన్‌స్పెక్టర్ (ఏఆర్ సీపీఎల్) 3, అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎఫ్‌పీబీ) 23, పోలీసు కానిస్టేబుల్ (ఎస్ఏఆర్ సీపీఎల్) 24, పోలీసు కానిస్టేబుల్ (డ్రైవర్‌పీటీవో) 20, మెకానిక్ పీటీవో 7 పోస్టులను భర్తీ చేయనుంది.



## మోడీ 3 దేశాల పర్యటన ఖరారు

**నేషనల్ బ్యూరో :** ప్రధాని నరేంద్ర మోడీ ఈ నెల 6 నుంచి 11 వరకు ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లో పర్యటించనున్నారు. ఈ 3 దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకునే దిశగా మోడీ ఈ పర్యటన చేయనున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) శుక్రవారం వెల్లడించింది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ మొదట ఇండోనేషియాను సందర్శిస్తారు. ఆ తర్వాత ఆస్ట్రేలియాకు ప్రయాణమవుతారు. అక్కడ ఆయన ప్రధాన అధికారిక కార్యక్రమాలు మెల్‌బోర్న్‌లో జరుగుతాయి. అనంతరం న్యూజిలాండ్‌కు వెళ్లి తన పర్యటనను ముగిస్తారని ఎంఈఏ కార్యదర్శి (ఈస్ట్) రుద్రేంద్ర టాండన్ తెలిపారు.

### 40 ఏళ్లలో మొదటిసారి..

ప్రధాని మోడీ న్యూజిలాండ్ పర్యటన ఎంతో ప్రత్యేకమైనది. దాదాపు 40 సంవత్సరాల తర్వాత ఒక భారత ప్రధాన మంత్రి ఆ దేశంలో పర్యటించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. వచ్చేవారం ప్రధాని మోదీ న్యూజిలాండ్‌లో తన మొదటి అధికారిక పర్యటన చేయనున్నట్లు ఆ దేశ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ ఈ రోజు ఉదయం అధికారికంగా ప్రకటించారు. "భారత ప్రధాని నరేంద్ర మోదీ వచ్చే వారం న్యూజిలాండ్‌లో తన మొదటి అధికారిక పర్యటన చేయనున్నారని ప్రకటించడానికి నేను ఎంతో సంతోషిస్తున్నాను" అని లక్సన్ తన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అయితే ఈ పర్యటన గురించి కచ్చితమైన తేదీలను ఆయన వెల్లడించలేదు. ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం ఒకటి అని కొనియాడిన లక్సన్, న్యూజిలాండ్ ఆర్థిక శ్రేయస్సుకు భారత్ ఎంతో కీలకమైనదని స్పష్టం చేశారు. "ఏప్రిల్‌లో కుదిరిన 'న్యూజిలాండ్ఇండియా ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్' (ఎఫ్‌టీఏ) ద్వారా ఇరుదేశాల మధ్య సంబంధాలను మేము తదుపరి స్థాయికి తీసుకెళ్తున్నాం. ఇది న్యూజిలాండ్‌కు మరిన్ని ఉద్యోగాలను, అధిక ఎగుమతులను, బలమైన ఆర్థిక వృద్ధిని అందిస్తుంది" అని పేర్కొన్నారు. ఈ ఒప్పందం కొత్త అవకాశాలను తెరుస్తుందని, న్యూజిలాండ్ వస్తు, సేవలకు 1.4 బిలియన్ల (140 కోట్ల) జనాభా కలిగిన భారీ మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తుందని లక్సన్ అన్నారు. ఇది కివి (న్యూజిలాండ్) సమాజంలోకి మరింత ఆదాయాన్ని తీసుకువస్తుందని చెప్పారు. అంతేకాదు ఉద్యోగాలను సృష్టిస్తుందని, వేతనాలను పెంచుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్, న్యూజిలాండ్‌ల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంపొందించడానికి, పెట్టుబడులను ప్రోత్సహించడానికి ఈ సంవత్సరం ప్రారంభంలోనే భారత్, న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సంతకాలు చేశాయి.

### ఇండోనేషియా పర్యటన

నివేదికల ప్రకారం, భారతదేశంలో ప్రజల జీవితాలను, జీవనోపాధిని మార్చడంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) సాధించిన విజయాన్ని చూసి, ఆ రంగంలో భారత్‌తో భాగస్వామ్యం పట్ల ఇండోనేషియా చాలా ఆసక్తి కనబరుస్తోంది. ఇందులో భాగంగానే, 2026 జూన్ 7న ఢిల్లీలో 8వ ఇండియాఇండోనేషియా జాయింట్ కమిషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి భారత విదేశాంగ మంత్రి (ఈఏఎం) ఎస్ .జైశంకర్ , ఇండోనేషియా విదేశాంగ మంత్రి సుగియోనో సంయుక్తంగా అధ్యక్షత వహించారు.

### ఆస్ట్రేలియా పర్యటన..

ఇక మోదీ తన ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా, ఇరుదేశాల మధ్య ఉన్న సన్నిహిత వ్యూహాత్మక సంబంధాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఇటీవలే మే 26న ఢిల్లీలో జరిగిన 'ఫారిన్ మినిస్టర్స్ ఫ్రేమ్ వర్క్ డైలాగ్ ' (ఎఫ్ఎంఎఫ్‌డీ) సందర్భంగా విదేశాంగ మంత్రి జైశంకర్ తన ఆస్ట్రేలియా కౌంటర్ పార్ట్ పెన్నీ వాంగ్‌తో సమావేశం కావడం గమనార్హం. ఈ పర్యటనలో అత్యంత ముఖ్యమైన ఘట్టంగా జులై 9న మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరగనున్న 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' అనే భారీ కమ్యూనిటీ ఈవెంట్‌లో ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. ఆస్ట్రేలియా ఇండియా ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం, విక్టోరియా రాష్ట్ర చరిత్రలోనే భారత్ ఆస్ట్రేలియా కమ్యూనిటీల మధ్య జరిగిన అతిపెద్ద సమ్మేళనాలలో ఒకటిగా నిలవనుందని అంచనా.

## భూతగాదాల్లో జోక్యం వద్దు

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** పోలీసులు ప్రజలకు రక్షణ కవచంలా ఉండాలని, దర్పాన్ని ప్రదర్శించడం మానేసి విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర పోలీసు యంత్రాంగం పనితీరుపై డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. ముఖ్యంగా భూవివాదాలు, సివిల్ స్వభావం గల వ్యవహారాల్లో పోలీసులు అనవసరంగా జోక్యం చేసుకోవద్దని, ఇలాంటి ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో రాష్ట్రంలోని అన్ని యూనిట్ల అధికారులు, ఎస్‌హెచ్‌వోలతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా స్టేషన్లలో విజిటింగ్ అవర్స్‌ను తప్పనిసరిగా అమలు చేయాలని, అధికారులు తమ క్యాంప్ ఆఫీస్ విధానాన్ని వీడి కార్యాలయాల్లోనే విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.




### నేరాల నియంత్రణలో సాంకేతికత..

సీసీటీఎన్ఎస్ అప్‌డేషన్‌లో రాష్ట్రం ప్రస్తుతం 70 శాతం పురోగతి సాధించిందని, ఈ ప్రక్రియలో ఆదిలాబాద్, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలు ముందంజలో ఉన్నాయని ఆయన ప్రశంసించారు. ప్రతి ఎఫ్ఐఆర్‌కు సంబంధించిన ఆధారాలను ఈసాక్ష్యం పోర్టల్‌లో సకాలంలో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ విషయంలో భూపాలపల్లి (55%), సిద్దిపేట (39%) జిల్లాలు మెరుగైన ఫలితాలు సాధించాయని తెలిపారు. ఈసమన్ల అమలులో కామారెడ్డి (92.86%), వనపర్తి (92%) అద్భుత పనితీరు కనబరిచాయని కొనియాడారు. హైదరాబాద్‌లోని నాలుగు కమిషనరేట్ల పరిధిలో 70 శాతానికి పైగా సైబర్ నేరాలు నమోదవుతున్నాయని, వీటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులకు ప్రత్యేక సాంకేతిక శిక్షణ ఇస్తామని వెల్లడించారు.

### రాష్ట్రవ్యాప్తంగా గంజాయి, డ్రగ్స్ నిర్మూలన..

పోలీసు అధికారులు సామాజిక బాధ్యతతో పనిచేయాలని విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ అండ్ సేఫ్టీ కమిటీలను బలోపేతం చేయాలన్నారు. ఈగల్ విభాగం ద్వారా ఇప్పటి వరకు 825 మంది విద్యార్థులకు కౌన్సెలింగ్, పునరావాస సేవలు అందించామని తెలిపారు. అరైవ్ అలైవ్ కార్యక్రమం విజయవంతం కావడం వల్ల రాష్ట్రంలో రోడ్డు ప్రమాద మరణాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని ఆయన పేర్కొన్నారు. అత్యవసర సేవల స్పందనను మరింత వేగవంతం చేసేందుకు త్వరలోనే 112 సర్వీసులను డ్రోన్ టెక్నాలజీతో అనుసంధానించనున్నట్లు వెల్లడించారు. సోషల్ మీడియాలో వ్యాపించే పుకార్లపై నిరంతరం నిఘా ఉంచాలని, తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సూచించారు.

### విధి నిర్వహణలో ప్రతిభ..

డయల్ 100 కాల్‌కు వేగంగా స్పందించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడబోయిన వ్యక్తి ప్రాణాలను కాపాడిన జగిత్యాల జిల్లా మెట్‌పల్లి ఎస్ఐ అన్వర్ బేగంను ప్రశంసించారు. గచ్చిబౌలిలో నేపాలీ దొంగల ముఠాను పట్టుకున్న అధికారి నరేష్, రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి హత్య కేసులో నిందితులకు శిక్ష పడేలా చేసిన సీఐ రమాకాంత్, దర్యాప్తు అధికారులు నవీన్ కుమార్, శ్రీనివాసులను అభినందించారు. అలాగే మెదక్ జిల్లా శివంపేట హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష పడేలా శ్రమించిన సీఐ శ్రీధర్, వెంకటరాజ గౌడ్, నల్గొండలో మోస్ట్ వాంటెడ్ నిందితుడిని ధైర్యసాహసాలతో పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ విష్ణు, కానిస్టేబుల్ శ్రీకాంత్‌లకు డీజీపీ కార్యాలయంలో రివార్డులు అందజేస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో లా అండ్ ఆర్డర్ డీజీ, సీఐడీ డీజీ, టెక్నికల్ సర్వీసెస్ డీజీ శ్రీనివాసరావుతో పాటు రాష్ట్రవ్యాప్త పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఉస్మానియా వైద్యులు దేశానికే గర్వకారణం

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** ఉస్మానియా డాక్టర్లు తెలంగాణతో పాటు యావత్ దేశానికే గర్వకారణంగా నిలిచారని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కొనియాడారు. ప్రపంచంలోనే అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సల్లో ఒకటిగా భావించే మల్టీవిసెరల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను డాక్టర్ మధుసూదన్ బృందం 36 గంటల పాటు శ్రమించి విజయవంతం చేయడం అసాధారణ విజయమన్నారు. దేశ వైద్య చరిత్రలోనే ఉస్మానియా జనరల్ హాస్పిటల్ వైద్య బృందం అరుదైన ఘనత సాధించిన వైద్య బృందాన్ని మంత్రి అభినందించారు. దేశంలోనే తొలిసారిగా ఒకే రోగికి, ఒకేసారి ఐదు అవయవాల (మల్టీవిసెరల్) మార్పిడి శస్త్రచికిత్సను ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతంగా నిర్వహించి సరికొత్త రికార్డు సృష్టించారని కితాబునిచ్చారు. ఈ చారిత్రాత్మక విజయాన్ని సాధించిన ఉస్మానియా సర్జికల్ గ్యాస్ట్రో హెచ్ఓడీ డా. మధుసూదన్ నేతృత్వంలోని వైద్య బృందాన్ని మంత్రి శుక్రవారం సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ ప్రక్రియలో భాగస్వాములైన గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు, ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు, అనస్థీషియా నిపుణులు, క్రిటికల్ కేర్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్లందరినీ మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే, అవయవదానం ద్వారా మరొకరికి పునర్జన్మ ప్రసాదించిన దాత కుటుంబ సభ్యుల సేవాభావాన్ని కొనియాడుతూ.. 'అవయవదానం.. మహాదానం' అనే సందేశాన్ని ప్రతి ఒక్కరూ సమాజంలోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ సంస్థలకు ధీటుగా తీర్చిదిద్దుతున్నామని... ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనే ప్రజలకు అన్నిరకాల మెరుగైన వైద్య సేవలు అందించాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.



### వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు..

గత రెండున్నరేళ్లలో ఆరోగ్యశాఖలో సుమారు 15 వేల పోస్టులను భర్తీ చేశామని, తాజాగా మరో 6,238 పోస్టులను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. పాత, అద్దె భవనాల్లో నడుస్తున్న ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలకు కొత్త భవనాలను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. రోగ నిర్ధారణ కోసం అత్యాధునిక ఎక్విప్‌మెంట్, అడ్వాన్స్‌డ్ ఆపరేషన్ థియేటర్లను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా డాక్టర్లు, వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ జాతీయ స్థాయిలో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉస్మానియా వైద్యులు డా. సుదర్శన్ రెడ్డి, డా. యాస్మీన్ ఫాతిమా, డా.భావన, వైద్యులు, నర్సింగ్, ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు.

## తెలంగాణ ఎగుమతుల సామర్థ్యం పెంచండి

**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్‌ప్రెస్:** తెలంగాణ ఎగుమతుల సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్‌కు లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. వ్యవసాయం, ఔషధాలు, వైద్య పరికరాలు, వస్త్ర పరిశ్రమ, ప్రత్యేక ఆర్థిక మండలాలు తదితర రంగాల్లో నాణ్యత, పరిశోధన, మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలను కేంద్రం పరిశీలించాలని కోరారు. నిజామాబాద్ ప్రాంతంలో అధిక దిగుబడి, అధిక కర్కుమిన్ శాతం కలిగిన పసుపు విత్తనాల అభివృద్ధికి పరిశోధన చేపట్టాలని.. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ప్రతిపాదించారు. అలాగే పసుపు ఆరబెట్టడం, నూనె తయారీ కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేస్తే ఎగుమతులకు మరింత ఊతమిస్తుందని సూచించారు.

### కరీంనగర్‌లో స్పైస్ బోర్డు ల్యాబ్..

పసుపు, మిర్చి, అల్లం వంటి సుగంధ ద్రవ్యాల నాణ్యత పరీక్షల కోసం కరీంనగర్ జిల్లాలో స్పైస్ బోర్డు ప్రయోగశాల ఏర్పాటు చేయాలని కోరారు. దీనివల్ల ఎగుమతుల సమయంలో అవసరమైన నాణ్యత ధృవీకరణ సులభతరం అవుతుందని పేర్కొన్నారు. అలాగే వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కాలాన్ని పెంచేందుకు ఆధునిక ప్యాక్‌హౌస్‌తో కూడిన ఇర్రాడియేషన్ కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. వరంగల్ లేదా ఆదిలాబాద్‌లో పత్తి నాణ్యత పరీక్షా ప్రయోగశాల ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ఔషధ పరిశ్రమకు మద్దతుగా అత్యాధునిక వ్యాక్సిన్ టెస్టింగ్ ల్యాబ్, మెడికల్ డివైజ్‌ల కోసం కామన్ టెస్టింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. ప్రస్తుతం డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయం విశాఖపట్నంలో మాత్రమే ఉన్నదని.. తెలంగాణ పారిశ్రామిక, ఎగుమతి రంగాల్లో దేశంలో అగ్రగామిగా ఎదిగిన



నేపథ్యంలో హైదరాబాద్‌లో ప్రత్యేక డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. 202526లో తెలంగాణ ఎగుమతులు రూ.2.20 లక్షల కోట్లకు చేరగా, రాష్ట్రంలో 50 ఎస్ఈజెడ్‌లు, 313 ఆపరేషనల్ యూనిట్లు ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో అదనపు ఇన్‌ల్యాండ్ కంటైనర్ డిపోలు, మరో మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్క్, ప్రత్యేక లాజిస్టిక్స్ స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దీంతో ఎగుమతిదారుల రవాణా వ్యయాలు తగ్గడంతో పాటు సరుకు రవాణా సామర్థ్యం పెరుగుతుందని పేర్కొన్నారు.

### కంటైనర్ తయారీ క్లస్టర్‌కు ప్రతిపాదన..

దేశంలో కంటైనర్ తయారీ సామర్థ్యాన్ని పెంచేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన పథకం కింద తెలంగాణలో కంటైనర్ తయారీ క్లస్టర్ ఏర్పాటు చేయాలని కూడా శ్రీధర్‌బాబు కోరారు. రాష్ట్రంలోని ఇంజినీరింగ్, స్టీల్ ఫ్యాబ్రికేషన్ రంగాలకు ఇది కొత్త అవకాశాలను తీసుకువస్తుందని లేఖలో పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలన్నింటికి కేంద్రం ఆమోదం తెలపాలని, తద్వారా తెలంగాణ ఎగుమతుల సామర్థ్యం, నాణ్యత, అంతర్జాతీయ పోటీతత్వం మరింత పెరుగుతుందని విజ్ఞప్తి చేశారు. కాగా.. ఈ అంశాలపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సానుకూలంగా స్పందించారు. ఎరాడిషన్ ఫెసిలిటీ, టెస్టింగ్ ల్యాబరేటరీ ప్రతిపాదనపై త్వరలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్లోబల్ ఎక్స్‌పోర్ట్ హబ్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రశంసలు కురిపించారు. ఈ అంశంలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ ముందంజలో ఉందని కితాబునిచ్చారు.



ప్రారంభమైన

# రాజగోపుర పూజలు..!

**రేపు ప్రారంభోత్సవం.. ఏర్పాట్లు పూర్తి**

**ఝరాసంగం/జహీరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహరాజ్ ఆశ్రమంలో నూతనంగా నిర్మించిన రాజగోపుర ప్రారంభోత్సవ పూజలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం సాయంత్రం విఘ్నేశ్వర ఆరాధన, పుణ్యాహావచనం, ఋత్విక్ వరణం, మృత్తికా గ్రహణం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, అంకురార్పణ, జలాధివాసం తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం 7:25 గంటలకు ప్రారంభమైన యాగశాల యజ్ఞం రాత్రి 9:10 గంటల వరకు కొనసాగింది. మూడు రోజులపాటు నిర్వహించనున్న రాజగోపుర ప్రారంభోత్సవాలు ఆశ్రమ పీఠాధిపతులు అవధూతగిరి మహరాజ్, సిద్ధేశ్వరానందగిరి మహరాజ్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. రాజగోపుర నిర్మాణ దాత హైదరాబాద్ నిజాంపేట్‌కు చెందిన కోలన్ సునీత భద్రారెడ్డి యజ్ఞం, పూజలు నిర్వహించనున్నారు. భక్తులకు ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు. ఆలయ పరిసరాలు మంగళ వాయిద్యాలు, మంత్రోచ్చారణలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది.



## ప్రపంచ స్థాయి సాహస విజయాన్ని సాధించిన
# డా.రాజశేఖర్ రెడ్డికి ఘన సన్మానం






**హైదరాబాద్, స్నేహిత ఎక్స్ ప్రెస్:** జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా వైద్య సేవల్లో విశేష కృషి చేస్తూనే ప్రపంచ స్థాయిలో అరుదైన సాహస విజయాన్ని సాధించిన శ్రీ మంజు హాస్పిటల్స్ రోబోటిక్ చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డా. రాజశేఖర్ రెడ్డిని కేపీహెచ్‌బీలోని శ్రీ మంజు హాస్పిటల్స్ లో యాజమాన్యం ఘనంగా సత్కరించారు. డా. రాజశేఖర్ రెడ్డి ప్రపంచంలోని అత్యంత ప్రతికూల వాతావరణం కలిగిన గ్రీన్‌ల్యాండ్ ప్రాంతంలో మైనస్ 35 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను తట్టుకుని విజయవంతంగా ట్రెక్కింగ్ పూర్తి చేసి అరుదైన ఘనత సాధించారు. ఈ సాహసయాత్రలో భారత జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశ గౌరవాన్ని అంతర్జాతీయ వేదికపై చాటారు. వైద్య వృత్తిలో అత్యాధునిక రోబోటిక్ ఆర్థోపెడిక్ శస్త్రచికిత్సలు, క్లిష్టమైన జాయింట్ రీప్లేస్‌మెంట్, ట్రామా, స్పైన్ సర్జరీల్లో విశేష అనుభవం కలిగిన డా. రాజశేఖర్ రెడ్డి వేలాది మంది రోగులకు నూతన జీవితం అందిస్తున్నారు. 2021లో ప్రారంభమైన శ్రీ మంజు హాస్పిటల్స్ తక్కువ కాలంలోనే నాణ్యమైన వైద్య సేవలతో ప్రజల విశ్వాసాన్ని సంపాదించింది. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక అభినందన కార్యక్రమంలో హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్, ప్రముఖ వైద్యులు పాల్గొని డా. రాజశేఖర్ రెడ్డిని ఘనంగా సన్మానించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ రెడ్డి అచీవ్మెంట్ చేసిన వాటికి గాను అభినందించేందుకు ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కూడా పిలుపు అందిందని యాజమాన్యం తెలిపింది.





## జీవో 17 రద్దు చేసే వరకు
# వదిలిపెట్టం

- నిరుపేదల ఆస్తులు గుజరాతీ కంపెనీలకు
- పారదర్శకంగానే భారీ కుంభకోణం
- దమ్మuంటే విచారణ చేయండి.. జైలుకు వెళ్లడానికి సిద్ధం
- ప్రభుత్వ పెద్దలను కాపాడే ప్రయత్నంలోనే మంత్రులు
- బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**తెలంగాణ బ్యూరో, స్నేహిత ఎక్స్ ప్రెస్:** తెలంగాణలో నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేలా తెచ్చిన జీవో నం.17ని రద్దు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నీడలా వెంటాడుతామని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి కోటరీని కాపాడే క్రమంలో మంత్రులు తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని, దీనివల్ల వారే భవిష్యత్తులో జైలుకు వెళ్లాల్సి ఉంటుందని ఆయన అన్నారు. ప్రభుత్వ తీరుపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు చెరిగారు. "మేము తెలంగాణ భవన్‌లో ఎదురుచూస్తుంటే తోక ముడిచి పారిపోయిన మంత్రులు, ఇప్పుడు సోమాజిగూడలో కుర్చీలు వేసుకుని పిలవడం ఏమిటి? ఇది అవమానం కాదా?" అని ప్రశ్నించారు. గన్ పార్కుకు వెళ్తున్న తమను మంత్రుల ఆదేశాల మేరకే పోలీసులు అక్రమంగా అరెస్టు చేయించారని ఆరోపించారు. ఒక మాజీ ఐపీఎస్ అధికారిగా, కరీంనగర్ ఎస్పీగా పనిచేసిన తనకు పోలీసుల పనితీరు, ప్రభుత్వం ఇచ్చే ఆదేశాల వెనుక ఉన్న రాజకీయాలు బాగా తెలుసని ఆయన స్పష్టం చేశారు.

**జీవో 17 వెనుక ఉన్నదెవరు?**

జీవో 17 వెనుక ఉన్న అదృశ్య శక్తులు ఎవరు, ఎందుకు ఇంత పారదర్శకంగా కుంభకోణానికి పాల్పడుతున్నారని ప్రవీణ్ కుమార్ నిలదీశారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు లేదా ఏ ప్రభుత్వ శాఖకు సంబంధం లేని 'ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్' ను ఎందుకు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులకు చెందాల్సిన అవకాశాలను, రూ.300 కోట్ల టర్నోవర్ ఉన్న కంపెనీలకు, రూ.6 కోట్ల నుండి రూ.12 కోట్ల సెక్యూరిటీ డిపాజిట్లు కట్టగల పెద్దలకు మాత్రమే ఎందుకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. పారదర్శకంగా టెండర్లు జరగడం లేదని, పార్క్ హయత్ హోటల్‌లో మద్యం, బిర్యానీలు తింటూ పేద వర్గాలకు అవకాశం లేకుండా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తనపై విచారణ చేయించాలని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. "నేను తొమ్మిదేళ్లు సెక్రటరీగా పనిచేసిన కాలంలో ఒక్క తప్పు కూడా జరగలేదు. ఇప్పుడు మీరు ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి, బూతద్దం పెట్టి వెతికినా విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లుగా మారిన విజయాలే కనిపిస్తాయి తప్ప అవినీతి కనిపించదు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తప్పు చేశానని నిరూపిస్తే తన కోసం ప్రత్యేక జైలు కట్టాలని, లేనిపక్షంలో ఈ కుంభకోణానికి బాధ్యులైన మంత్రులు జైలుకు వెళ్లడానికి సిద్ధం కావాలని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, భట్టి విక్రమార్క అందరూ కలిసి చేసిన ఈ దోపిడీపై ప్రజలందరూ గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.



Printed, Published, Edited & Owned by **Rathod Vinod Kumar**, Printed At Falcon Printing Press, **SNEHITHA PUBLICATIONS** #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad Town,Sangareddy Dist: Pin :502220, State :Telangana, Published at SNEHITHA PUBLICATIONS #1-2-201,Shop No 2, Khan Street, Zaheerabad, 502220, Dist: Sangareddy, T.S., Editor: **Rathod Vinod kumar**, RNI. No. APTEL/2009/29308, Cell: 9550021491,8341021491Mail :expresstelugudaily@gmail.com